క్లుప్తంగా

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘం నాయకులు

రామచంద్రపురం(పటాన్‌చెరు): మణిపూర్ బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో మత ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మణిపూర్ బాధ్యత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశాంత్, కుమార్, పీటర్, జైపాల్ పాల్గొన్నారు.

'ఖేడ్' ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఇటీవల నారాయణఖేడ్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన విద్యాచర్ రెడ్డిని కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గొంగడి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురుమ సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు జీఎస్ ప్రభాకర్, మండలాల బాధ్యులు అంజన్న, సాయి, నవనాథ్, దశరథ్, దత్తు, సంతోష్, సాయిలు, కాశీ, సుభాష్, విఠల్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే



రాములు, ఆంజనేయులును సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి


పటాన్‌చెరు టౌన్: పోలీసు వృత్తిలో బదిలీలు సహజమేనని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న రాములు, ఆంజనేయులు బదిలీపై వెళ్తుండడంతో వారిని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ప్రోత్సహించాలి

సంగారెడ్డి టౌన్: చేతివృత్తిదారులను ప్రోత్సహించాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని టీటీడీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన చేనేత కళాహస్త ప్రదర్శన అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతి వృత్తిదారులు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రదర్శన అమ్మకందారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లి, కొండాపూర్‌లో ఆదివారం సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కేటీఆర్ గతంలో గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గీత కార్మికులందరికీ ద్విచక్రవాహనం, సేఫ్టీ మోకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ బంధును వర్తింపచేయాలన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని కోరారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో కల్లుగీత కార్మికులను ఐక్యం చేసి హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, మారెపల్లి సర్పంచ్ వెంకటేశంగౌడ్, గౌడ సంఘం నాయకులు దుర్గాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అత్యవసర వైద్యానికి అవస్థలు

- అందని 108 అంబులెన్స్ సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న స్థానికులు

వట్‌పల్లి(అందోల్): ప్రమాదాలు సంభవించినప్పుడు.. ఆకస్మాత్తుగా గుండెనొప్పి వంటి ఇతర అనారోగ్య కారణాలు ఎదురై అత్యవసర వైద్యం అవసరమైన పరిస్థితుల్లో గుర్తొచ్చేది కుయ్..కుయ్ అంటూ వచ్చే 108 అంబులెన్స్ వాహనం. ఓవైపు ప్రభుత్వం ఆరోగ్య రంగంలో వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నా ఇక్కడి ప్రజలకు కనీసం అంబులెన్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వైద్యశాఖ అధికారులు స్పందించి వట్‌పల్లి మండలానికి 108 వాహన సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దూరాభారంతో ఇబ్బందులు

మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా 28 వేలకు పైగా జనాభా ఉంది. మారుమూల గ్రామాల్లో ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి వస్తే జోగిపేట నుంచి అంబులెన్స్ వెళ్లాల్సి ఉంటుంది. సంఘటన స్థలానికి 108 వాహనం చేరుకోవడానికి 45 నిమిషాల వరకు సమయం పడుతోంది. గిరిజన తండాలకు, దూరంగా ఉన్న చివరి గ్రామాలకు ఎటువైపు నుంచి 108 వాహనం రావాలన్నా 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సిన పరిస్థితి.



వట్‌పల్లి మండల కేంద్రం వ్యూ

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ఏదైన ప్రమాదం సంభవించిన సమయంలో క్షతగాత్రులను తరలించేందుకు 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. ఆస్పత్రి ఖర్చులకే ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రైవేట్ వాహనాల చార్జీలు మరింత భారంగా మారుతున్నాయి. 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జిల్లాలో 15 అంబులెన్సులు ఉండగా ఇటీవల కొత్తగా కోహీర్, జహీరాబాద్‌లకు రెండు అంబులెన్స్‌లు కేటాయించగా వాటి సంఖ్య 17కు చేరింది. జిల్లాలో మరో రెండు చోట్ల తప్పనిసరిగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓ సూచించగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉత్తర్వులు రాగానే పుల్కల్‌తో పాటు మరోచోట అవసరాన్ని బట్టి అంబులెన్స్ కేటాయిస్తాం.

– హుస్సేన్, 108 వాహనాల జిల్లా సమన్వయకర్త

బీఆర్‌ఎస్ వాళ్లకేనా దళితబంధు?



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ శ్రేణులకే ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. అర్హులైన ప్రతి దళితుడికి దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నారంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దళితుల పట్ల ప్రభుత్వ వివక్ష చూపుతోందని వాపోయారు. జిన్నారం మండలంలో 955 దళిత కుటుంబాలు ఉండగా కేవలం 152మంది కుటుంబాలకు మాత్రమే దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తున్నారని తెలిపారు. మిగతా కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దళితులకు న్యాయం జరిగే వరకు దళితుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, ముఖ్య నేతలు, ఆయా గ్రామాల దళితులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



కొండాపూర్: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రముఖ ప్రజా గాయకుడు రచయిత, కవి, గద్దర్ మరణం సామాజిక ప్రజా ఉద్యమాలకు తీరని లోటని కేవీపీఎస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజలను తన గానంతో చైతన్య పరిచిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా సభ్యులు దత్తు, దాసు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, కార్యకర్తలు ప్రసాద్ చిరంజీవి, సంజీవ్ పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం

రాయికోడ్(అందోల్): ప్రజాగాయకుడు గద్దర్ అకాల మరణం విప్లవ సమాజానికి తీరని లోటని, ఉద్యమ గళానికి గద్దర్ పునాది వేశారని యువజన సంఘాల జిల్లా నాయకుడు కృష్ణ కొనియాడారు. గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గద్దర్ మరణం తీరని లోటు

హత్నూర(సంగారెడ్డి): ప్రజా యుద్ధనౌక, బడుగు బలహీన వర్గాల గొంతుక గద్దర్ అకాల మరణం తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బేగరి యాదగిరి అన్నారు. మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలను వదులుకొని అణగారిన వర్గాల ప్రజల కోసం ఉద్యమాల బాట పట్టారన్నారు. కారంచేడు, చుండూరు వంటి ఘటనలకు వ్యతిరేకంగా తన పాట ఆటలతో ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. తన చివరిశ్వాస వరకు ప్రజల కోసమే పరితపించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు.

గద్దర్ మరణం బాధాకరం

పటాన్‌చెరు టౌన్: ప్రజా గాయకుడు గద్దర్ మరణం బాధాకరమని వైఎస్‌ఆర్‌టీపీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్ తన పాటల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న భిక్షపతి

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. చౌటకూర్ మండలంలోని శివంపేట్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్‌కిరణ్, ఉమ్మడి పుల్కల్ వైస్ ఎంపీపీ గాజుల వీరేందర్, ఉమ్మడి మండలాల అధ్యక్షులు విజయ్, శివకుమార్, సర్పంచ్ కిష్టారెడ్డి, ఉమ్మడి పుల్కల్ మండలం కోఆప్షన్ మెంబర్ అలీమ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మునిపల్లి(అందోల్): మండలంలోని పిల్లోడి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సిద్ధేశ్వరస్వామి

జహీరాబాద్: మనిషి జీవన విధానాన్ని తెలిపే భగవద్గీతను రామకృష్ణ శిష్యబృందం విస్తృతంగా ప్రచారం చేయాలని బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరస్వామి అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో గీత ప్రచారకులు యెన్నం రామకృష్ణ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాల కాలంగా రామకృష్ణ మహనీయులు భగవద్గీతను ప్రచారం చేసి వేలాది మందిని సుశిక్షితులను చేసి తీర్చిదిద్దారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా తన శిష్య బృందంతో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రంజోల్ రాజయోగ పీఠాధిపతి రాచయ్యస్వామి, వ్యాపారవేత్త అల్లాడి వీరేశం, ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ వినోద్ కుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నాయకులు నగేశ్, స్థానిక నాయకులతో కలిసి ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను ఆదివారం సన్మానించారు. సత్యనారాయణను ఎమ్మెల్సీగా ప్రభుత్వం ప్రకటించటం సంతోషంగా ఉందని తెలిపారు.

ఎమ్మెల్సీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్సీ సత్యనారాయణ, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కుతాడు రాములును జహీరాబాద్ ఎరుకల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎరుకల సంఘం అధ్యక్షుడు కెంపుల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు మధుగొండ శ్రీనివాస్, కార్యదర్శి కోహీర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ బీబీ పాటిల్, జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ



పటాన్‌చెరు టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు

జయశంకర్ సేవలు చిరస్మరణీయం

జిల్లావ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన తుదిశ్వాస కోసం పరితపించారని కొనియాడారు. – నెట్‌వర్క్



రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్, నాయకులు



జిన్నారం: నివాళులర్పిస్తున్న నాయకులు



సంగారెడ్డి టౌన్: మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి నగేష్

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి మండల పరిధిలోని బిజిలీపూర్, మర్వెల్లి గ్రామాల మధ్య కల్వర్టు వద్ద ఒకవైపు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నెల రోజులవుతున్నా రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు దెబ్బతిన్న ప్రదేశంలో రోడ్డు మూసివేయబడినది అంటూ రోడ్డుకు ఇరువైపులా బ్యానర్లు ఏర్పాటు చేసి వదిలేయడంపై జులై 31న ‹ఎన్నాళ్లీ రోడ్డు మూసివేత?› అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం రోడ్డుకు మరమ్మతుల పనులు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి ధన్యవాదాలు తెలియజేశారు. రోడ్డు మరమ్మతు పనులు 10 రోజుల్లో పూర్తిచేసి ప్రయాణ ఇబ్బందులను తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ మనోజ్ తెలిపారు.



పనులు చేపడుతున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

రేపు సదరం క్యాంపు

జిన్నారం(పటాన్‌చెరు): ఈ నెల 8న నిర్వహించనున్న సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో వికలాంగులకు సూచించారు. సదరం క్యాంపును సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు మీ–సేవాలో స్లాట్ బుక్ చేసుకొని క్యాంపులో పాల్గొనాలని సూచించారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న అధికారి వినోద్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. శానిటరీ అధికారి వినోద్ ఆధ్వర్యంలో నిల్వ ఉన్న నీటి ద్వారా దోమలు వ్యాపిస్తుండటంతో రసాయన మందులతో పరిసరాలను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ మొక్కలు పంపిణీ

నారాయణఖేడ్: హరితహారంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డుకు సంబంధించిన కాలనీలలో ఇంటింటికీ ఆరు పూలమొక్కల చొప్పున శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

◆ బీజేపీని బలోపేతం చేయాలి

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీని క్షేత్ర స్థాయి నుంచి పటిష్టం చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి ఆదివారం జహీరాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్ రాజనర్సింహ, జిల్లా అధికార ప్రతినిధి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

◆ జహీరాబాద్ తహసీల్దార్‌గా రవీందర్

జహీరాబాద్: తహసీల్దార్‌గా ఎస్ రవీందర్ నియమితులయ్యారు. వికారాబాద్ నుంచి ఆయన జహీరాబాద్‌కు బదిలీ అయ్యారు. జహీరాబాద్ తహశీల్దార్‌గా పనిచేసిన స్వామి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో రవీందర్ రానున్నారు. కోహీర్ తహశీల్దార్‌గా శాంతకుమారి నియమితులయ్యారు.

◆ ఘనంగా బోనాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని కానుకుంట గండమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నర్సింగ్, కుమార్, యాదయ్య, రాణి యాదవ్, ప్రీతిగౌడ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా స్నేహితుల దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని రామచంద్రాపురం పట్టణం, భారతినగర్ డివిజన్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి స్నేహితులు ఒకరికొకరు కలుసుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

◆ సింగూరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గత నాలుగైదు రోజులుగా వర్షాలు కురుయకున్నా డ్యాంలోకి రోజు స్వల్పంగా వరదలు వస్తున్నాయని ప్రాజెక్టు ఏఈఈ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డ్యాం ఎగువభాగంలో వాగులు, చెరువులు నిండి అలుగులు పారుతుండటంతో ఆ నీరంతా డ్యాంలోకి చేరుకుంటోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 2400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుకుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా ప్రస్తుతం 27.617టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

◆ ఆర్థిక సాయం

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులోని క్రషర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంలో మృతి చెందిన మర్పల్లి నాగన్న కుటుంబ సభ్యులను బీఎస్పీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధురావణ్ నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, బాబురావు, రాజు, యాదగిరి, అరుణ్, మోజేష్ పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల బ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా సతీష్ కులకర్ణి, ప్రధాన కార్యదర్శిగా మాలిపటేల్ మధుసూదన్‌రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాఘవచారి, వినోద్‌పాటిల్ పాల్గొన్నారు.

◆ ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైబర్ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్ కాలనీలో నివాసం ఉండే తులసిపతి (31) ఎలక్ట్రిషన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తులసిపతి అతని మిత్రుడితో కలిసి ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం తులసిపతి మిత్రుడు నిద్రపోయి సాయంత్రం లేచి చూసేసరికి తులసిపతి వంట గదిలో సీలింగ్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. దీంతో వెంటనే మృతుడి సోదరుడు జయచంద్రకు సమాచారం అందించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరావాల్సి ఉంది.

◆ ఎస్‌ఐ పరీక్షకు మాజీ సర్పంచ్ ఎంపిక

మనూరు(నారాయణఖేడ్): ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అల్లపురే భీంరావు ఎంపికయ్యారు. దీంతో గ్రామస్తులు, యువకులు ఆయనను అభినందించారు. ఈయన బీటెక్ పూర్తిచేశారు. 2013 నుంచి 18వరకు కరస్‌గుత్తి సర్పంచ్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం కరస్‌గుత్తి పంచాయతీ టీపీఎస్ పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతూ ఎస్‌ఐ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ ఉత్తీర్ణత సాధించారు. చదంతో గ్రామంలో ఆయన్ను అభినందించారు.

